





తొలి వన్డేలో భారత్ ఘన 08

గురువారం | 05.11.2026 | సంపుటి : 4 | సంచిక : 188 | పేజీలు : 8 | వెల : 2/- www.nedudailynews.com



జాలర్లను కాపాడేందుకు వెళ్లి..
ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గల్లంతు

ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్..

నలుగురి గుర్తింపు

మరో ఆరుగురి సిబ్బంది ఆచూకీపై ఉత్కంఠ

మత్స్యకారులు వరదలో చిక్కుకోగా, రక్షించేందుకు రంగంలోకి వెళ్లిన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోటు తిరగపడడంతో గల్లంతయ్యారు. వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర పర్యవేక్షణలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించి గాలింపు మొదలుపెట్టారు. అయితే, బుధవారం రాత్రి నలుగురి సిబ్బంది ఆచూకీ గుర్తించారు. ఆతర్వాత మత్స్యకారులందరినీ ఒడ్డుకు చేర్చారు. మరో ఆరుగురి సిబ్బంది జాడ తెలియలేదు.

సత్తుపల్లి, నవంబర్ 4 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువుకు వరద చేరుతుండడంతో చేపలు కొట్టుకుపోకుండా వలలు కట్టేందుకు 8 మంది మత్స్యకారులు బుధవారం ఉదయం వెళ్లారు. వారు చెరువులోకి వెళ్లాక వరద మరింత పెరిగి అందులో చిక్కుకుపోయారు. ఈ విషయం ఆలస్యంగా బయటకు వెలుగుచూసింది. భద్రాద్రి జిల్లా దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో పలువురు వరదలో చిక్కుకోగా చాతకొండ బెటాలియన్ నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వెళ్లి రక్షించారు. అంతలోనే బేతుపల్లి చెరువులో మత్స్యకారులు చిక్కుకున్నారనే సమాచారం ఈ సిబ్బందికి హుటాహుటిన

-మిగతా 2 లో..

ట్రంప్‌కు షాక్

మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు పరాభవం

పట్టున్న రాష్ట్రాల్లోనూ ఘోర పరాజయం

కాంగ్రెస్ ఉభయ సభలూ డెమోక్రాట్ల వశం

ఎన్నికల్లో సత్తా చాటిన ఇండియన్ అమెరికన్లు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. మధ్యంతర ఎన్నికల్లో ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ అమెరికా కాంగ్రెస్‌లోని ఉభయ సభలపై పట్టు సాధించింది. కీలక రాష్ట్రాల్లో గవర్నర్ పదవులనూ కైవసం చేసుకుంది. ఈ ఫలితాలు అమెరికా రాజకీయాలపైనే కాకుండా అంతర్జాతీయ పరిణామాలపైనా ప్రభావం చూపనున్నాయి. ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్లు తమకు బలమైన పట్టున్న టెక్సాస్, జార్జియా, ఐయోవా, ఓహియో రాష్ట్రాల్లో గవర్నర్ పదవులను కోల్పోయారు. సెనెట్ ఎన్నికల్లోనూ టెక్సాస్, మైనే, సౌత్ కరోలినా, నార్త్ కరోలినా, కాన్సాస్, ఐయోవా, ఓహియో రాష్ట్రాల్లో ఓటమిని చవిచూశారు.

ఎన్నికల ప్రచారంలో ట్రంప్ స్వయంగా పాల్గొని, బ్యాలెట్‌పై తన పేరు ఉన్నట్లు భావించి ఓటేయాలని మద్దతుదారులకు పిలుపునిచ్చినా ఫలితం లేకుండా పోయింది. సెనెట్‌లో ఇంతకుముందు రిపబ్లికన్లకు 53-47 మెజారిటీ ఉండేది. వారి ఆధీనంలో ఉన్న కనీసం ఏడు స్థానాలను డెమోక్రాట్లు గెలుచుకోవడంతో సెనెట్‌పై పట్టు మారింది. ప్రతినిధుల సభలోనూ గతంలో రిపబ్లికన్లకు 220-215తో స్వల్ప ఆధిక్యం ఉండేది. మెజారిటీకి అవసరమైన 218 స్థానాలను డెమోక్రాట్లు దాటి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ట్రంప్ 2024లో రెండంకెల ఆధిక్యంతో గెలిచిన పలు నియోజకవర్గాల్లోనూ డెమోక్రాట్లు విజయం సాధించారు. ప్రతినిధుల సభలో రెండు డజన్లకుపైగా స్థానాలను తమ ఖాతాలో వేసుకున్నారు.





వాషింగ్టన్, నవంబర్ 4: ట్రంప్ విధానాలపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తే ఈ ఓటములకు కారణమని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధం, పెరుగుతున్న జీవన వ్యయం వంటి అంశాలు ఓటర్లను ప్రభావితం చేశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పీటీఐతో మాట్లాడిన పలువురు ఓటర్లు ట్రంప్ అబద్ధాలు, గొప్పలు చెప్పుకునే ధోరణి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జార్జియాలో ఓ డెమోక్రటిక్ ఓటరు మాట్లాడుతూ.. ట్రంప్‌ను తన పిల్లలకు ఆదర్శంగా చూపించలేనని, ఆయన పదవి నుంచి వీలైనంత త్వరగా వైదొలగాలని కోరుకుంటున్నానని చెప్పారు. ట్రంప్ మద్దతుతో ఓహియో గవర్నర్ పదవికి పోటీచేసిన భారత సంతతి అమెరికన్ వివేక్ రామస్వామి ఓటమి పాలయ్యారు. డెమోక్రటిక్ అభ్యర్థి అమీ ఆక్టన్ ఆయనపై విజయం సాధించారు. ఈ ఎన్నికల ప్రచారంలో రిపబ్లికన్ పార్టీలోనూ విభేదాలు తలెత్తాయి. ఎన్నికల ఫలితాలపై స్పందించిన రిపబ్లికన్ పార్టీ నేత క్రిస్ క్రిస్టీ.. ట్రంప్ శకం ముగిసింది అని వ్యాఖ్యానించారు.

మిగతా 2 లో

'సదర్' తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాం

రాష్ట్రంలో గొల్ల కులస్తులకు సముచిత స్థానం

సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 4 : సదర్ సమ్మేళనం యాదవులకే కాదని, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆత్మగౌరవ ప్రతీక అని..ఇది అద్భుతమైన కార్యక్రమమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదవుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో తాము కులగణన చేసి చూపించామని, తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా కులగణన నిర్వహించామన్నారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ఇందుకు యాదవుల సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి

-మిగతా 2 లో..



చికిత్స పొందుతూ
మహిళా కండక్టర్ మృతి

ప్రవళిక కుటుంబానికి రూ.10లక్షల 02

ఎక్స్‌గ్రేషియా: మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబరు 3 : చిల్లర డబ్బుల విషయమై ఓ ప్రయాణికురాలు బస్సులో నుంచి తోసేసిన ఘటనలో తీవ్రంగా గాయపడి పదిరోజుల పాటు మృత్యువుతో పోరాడిన మహిళా కండక్టర్ మంగళవారం రాత్రి మృతి చెందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన గుండ్ల ప్రవళిక (24)కు.. ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేసిన తండ్రి నాగరాజు చనిపోవడంతో వారసత్వం గా పదినెలల కిందట కండక్టర్ ఉద్యోగం వచ్చింది. మణుగూరు డిపోలో పనిచేస్తోంది. మరో రెండు నెలల్లో ప్రవళికకు వివాహం చేసేందుకు కుటుంబసభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. గతనెల 25న మణుగూరు నుంచి భద్రాచలం వెళ్లే సర్వీసులో విధులు నిర్వహిస్తున్న క్రమంలో అశ్వాపురం మండలం పిచికలతండాకు చెందిన

-మిగతా 2 లో..

కాంగ్రెస్ సంచులు మోస్తే..
బీజేపీ చెప్పులు మోస్తోంది

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పార్టీల నాయకత్వాల ముందు తాకట్టు


రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 4 : ఢిల్లీ పార్టీల వల్ల తెలంగాణకు ఏనాడు న్యాయం జరగలేదని, కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర హక్కులను ఢిల్లీ పార్టీల నాయకత్వాల ముందు తాకట్టు పెడుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీ పెద్దల ముందు

-మిగతా 2 లో..



నేటి చికెన్ ధరలు

పారం ధర లైవ్ బర్డ్	142 (కిలో)
రిటైల్ లైవ్ బర్డ్	169 (కిలో)
డ్రెస్డ్ స్కిన్‌తో	262 (కిలో)
స్కిన్ లెస్	296 (కిలో)

12 గుడ్ల రిటైల్ ధర ₹82

రైతు భరోసా పేరుతో
ఫేక్ మెసేజ్‌లు!

2.73 లక్షల మంది రైతుల ఫోన్లకు అనధికార సందేశాలు

వ్యవసాయ శాఖకు సంబంధం లేదని డైరెక్టర్ స్పష్టీకరణ

సమగ్ర దర్యాప్తు కోరుతూ సైబర్ క్రైమ్ డీజీపీకి లేఖ



హైదరాబాద్, నవంబర్ 4 : రైతు భరోసా పథకం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 2,73,128 మంది రైతుల మొబైల్ ఫోన్లకు అనధికార ఎస్ఎంఎస్‌లు చేరడం కలకలం రేపుతోంది. రైతు భరోసా పథకంలో భాగంగా పెట్టుబడి సాయాన్ని ఖాతాలో జమ చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేరిట రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఇది సమయం కూడా కాకపోవడంతో పలువురు బ్యాంకుల్లో ఆరా తీయగా.. ఎలాంటి నగదు జమ కాలేదని బయటపడింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి

-మిగతా 2 లో..

'మురసు' ప్రభావం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు

'అశ్వారావుపేటలో 27.7 సెం.మీ., పెనుబల్లిలో 22 సెం.మీ. వర్షం

'పలుచోట్ల చెరువులకు గండి, రహదారులపై పోటెత్తిన వరద

'పత్తి, వరి ఇతర పంటలకు తీరని నష్టం



ఖమ్మం, నవంబర్ 4 : ఉమ్మడి ఖమ్మం జిల్లాను 'మురసు'తుపాను ముట్టడించింది. మంగళవారం ఉదయం మొదలైన వర్షం రాత్రికి జోరందుకుంది. వర్ష ప్రభావం బుధవారం కూడా కొనసాగింది. భదాద్రి జిల్లా అశ్వారావుపేటలో అత్యధికంగా 27.6 సెం.మీ.ల వంపాతం నమోదైంది. ఆ తర్వాత ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో 22.5 సెం.మీ. సత్తుపల్లిలో 21.8, వేంసూరులో 21.2, కల్లూరులో 21 సెం.మీ., భద్రాద్రి జిల్లా మల్కారంలో 18.8 సెం.మీ,

-మిగతా 2 లో..



జాలర్లను కాపాడేందుకు వెళ్లి..
ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)

వారు ఇక్కడకు చేరుకున్నారు. ముందుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోట్లలో వెళ్లి రామనగరానికి చెందిన మత్స్యకారుడు బొందల రమేశ్, కాకర్లపల్లికి చెందిన మరో ఇద్దరు మత్స్యకారులను రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఆ తర్వాత మరో ఐదుగురి కోసం రెండు బోట్లలో సిబ్బంది, వారికి దారి చూపేందుకు రామానగరానికి చెందిన మత్స్యకారుడు బొమ్మకంటి రాజు బయలుదేరారు. దమ్మపేట మండలం నుంచి వరద బేతుపల్లికి చెరువు పోటెత్తి ప్రవాహం అంతకంతకూ పెరిగింది. ఈ క్రమంలోనే చెరువు నుంచి తమ్మిలేరు వాగుకు వెళ్లే వరద ఉధృతి కూడా పెరిగింది. దీంతో చెరువు అలుగు వద్ద బోట్లు తిరగబడ్డాయి. దీంతో వారు అలుగులో నుంచి తమ్మిలేరు వాగులో కొట్టుకుపోయారు. బేతుపల్లి చెరువు వద్దకు చేరుకున్న కలెక్టర్ దివాకర, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఖమ్మంలో ఉన్న విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించారు. సిబ్బంది బోట్లలో బేతుపల్లి చెరువులోకి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి వరద మధ్యలో చెట్టును ఆధారంగా చేసుకొని ఉన్న నలుగురు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని గుర్తించారు. ఇదే సమయంలో మత్స్యకారుల వద్దకు సైతం చేరుకొని వారిని తీసుకొని ఒడ్డుకు వచ్చారు. గుర్తించిన నలుగురు సిబ్బందిని కూడా ఒడ్డుకు తీసుకురావాల్సి ఉండగా, మరో ఆరుగురు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది జాడ తెలియలేదు. దీంతో తిరిగి గాలింపు చర్యలు ప్రారంభించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బోట్లు గల్లంతయిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆరా తీశారని, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఘటనపై మంత్రి నిరంతరం సమీక్షిస్తున్నారు.

'సదర్' తెలంగాణ
ఆత్మగౌరవ ప్రతీక

(మొదటిపేజీ తరువాయి)

గొల్లకొండ అని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. యాదవుల సహకారంతోనే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందిందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలన్న ఆలోచన చేయలేదని, గొల్ల కులస్తులు కోరగానే రాష్ట్ర పండుగగా ప్రకటించామని, సదర్ సమ్మేళనం నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. తమ ప్రభుత్వంలో గొల్ల కులస్తులకు సముచిత స్థానం కల్పించామని రేవంత్‌రెడ్డి అన్నారు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని వివరించారు. యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో యాదవుల వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. బిహార్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి, నేరగాళ్ల రాజ్యంగా మారిందని ఆర్జేడీ చీఫ్, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ విమర్శించారు. నగరంలో తమకు లభించిన అపూర్వ స్వాగతం మనసుకు తాకాయని, ఇంకా చారిత్రక సంప్రదాయం కొనసాగడం ఎంతో ప్రశంసనీయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అందరివాడని, అన్ని కులాలను అధ్యయనం చేసి, అందరికీ అన్ని రంగాల్లో లబ్ధి చేకూర్చారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఆయన రేవంత్‌రెడ్డి కాదని, రేవంత్ యాదవ్ అని, సందర్భాన్ని బట్టి రేవంత్ యాదవ్, ముదిరాజ్, గౌడ్ అని అన్నారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, కె. రఘువీర్ రెడ్డి, అఖిలేష్ యాదవ్ సోదరుడు, మాజీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, మాపీ ఎంపీ కేవీపీ రామచందర్‌రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా పేరుతో ఫేక్ మెసేజ్‌లు!

(మొదటిపేజీ తరువాయి)

మండలంలోని బైరవునిపల్లి, రాజేశ్వరపురం, పైనంపల్లి, నేలకొండపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతుల ఫోన్లకు బుధవారం మెసేజ్‌లు వచ్చాయి. 'తెలంగాణ రైతాంగానికి నమస్కారం, రైతు భరోసా పథకంలో భాగంగా మన ప్రజా ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఎకరాకు ఇచ్చే మొత్తం రూ.12 వేలకు పెంచింది. తదనుగుణంగా రూ.6,450 మీ బ్యాంకు ఖాతా నంబర్...లో జమ అయ్యాయి. ఈ సహాయం మీ వ్యవసాయం పెట్టుబడికి ఉపయోగపడుతున్నందుకు సంతోషిస్తున్నాను... మీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి'అని అందులో ఉండటంతో రైతులు కొందరు బ్యాంకులకు వెళ్లి ఆరా తీస్తే తప్పుడు మెసేజ్ అని తేలింది. దీనిపై నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి ఎం.రాధ వివరణ కోరగా.. రైతు భరోసా నిధులకు సంబంధించి పలువురికి నకిలీ మెసేజ్‌లు అందినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. అలాగే వేములవాడ కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల రైతులకు రైతుభరోసా పథకం ద్వారా ఖాతాలో జమైనట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఈ సందేశాలతో తమ శాఖకు ఎలాంటి సంబంధం లేదని వ్యవసాయ శాఖ స్పష్టంచేసింది. ప్రభుత్వ పథకం పేరుతో రైతులకు సందేశాలు పంపిన వారెవరు? ఏ ఉద్దేశంతో ఈ వ్యవహారానికి పాల్పడ్డారు? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి సైబర్ క్రైమ్ విభాగం డీజీపీకి బుధవారం లేఖరాశారు. రైతులకు అధికారిక సమాచారం పంపేందుకు వ్యవసాయ శాఖ సీడాక్ ఎస్ఎంఎస్ సర్వీస్ పోర్టల్‌ను వినియోగిస్తోందని, అయితే ప్రస్తుతం రైతులకు చేరిన సందేశాలను తమ శాఖ పంపలేదని స్పష్టంచేశారు. శాఖ పేరును లేదా ఎస్ఎంఎస్ వ్యవస్థను దుర్వినియోగం చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. సెండర్ ఐడీ, ట్రాన్స్‌మిషన్ లాగ్‌లు, ఐపీ అడ్రస్‌లు తదితర సాంకేతిక ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ పథకం పేరుతో ఇలాంటి అనధికార సందేశాలు పంపడం వల్ల రైతుల్లో గందరగోళం ఏర్పడటమే కాకుండా వ్యవసాయ శాఖ ప్రతిష్ట, రైతు భరోసా పథకం విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉందని డైరెక్టర్ ఆందోళన వ్యక్తంచేశారు. లేఖ ప్రతులను వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శికి కూడా పంపించారు.

ట్రంప్‌కు షాక్








ఓటమిని అంగీకరించిన ట్రంప్.. డెమోక్రాట్లకు అభినందనలు తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం వారితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఫలితాలను పూర్తిగా అంగీకరిస్తున్నానని న్యూయార్క్ టైమ్స్‌కు వెల్లడించారు. అయితే తనదైన శైలిలో ఓటమికి కారణాలను ఇతరులపైకి నెట్టారు. బ్యాలెట్‌పై తన పేరు లేకపోవడం వల్లే పార్టీ ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. తాను పోటీలో ఉండి ఉంటే భారీ మెజారిటీతో గెలిచేవాళ్లమని ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దక్షిణ కరోలినా సెనెటర్ డార్లిన్ గ్రాహమ్, టెక్సాస్ అటార్నీ జనరల్ కెన్ పాక్స్టన్‌లకు మద్దతు తెలిపినందుకు ఎలాంటి విచారం లేదన్నారు. కాన్సాస్‌లో రిపబ్లికన్ల కంచుకోట బద్దలైంది. ఇక్కడ పాస్టర్, రాజకీయ నాయకుడు ఆడమ్ హామిల్టన్ విజయం సాధించడంతో దాదాపు వందేండ్ల తర్వాత ఆ రాష్ట్ర సెనెట్ స్థానాన్ని డెమోక్రాట్లు గెలుచుకున్నట్టయింది. టెక్సాస్‌లో డెమోక్రటిక్ అభ్యర్థి జేమ్స్ తలారికో.. రిపబ్లికన్ కెన్ పాక్స్టన్‌ను ఓడించారు. దాదాపు 40 ఏండ్ల తర్వాత ఆ రాష్ట్రం నుంచి డెమోక్రటిక్ పార్టీకి చెందిన వ్యక్తి సెనెట్‌కు ఎన్నికయ్యారు. నార్త్ కరోలినాలో రాయ్ కూపర్.. రిపబ్లికన్ మైకెల్ వాట్లీపై విజయం సాధించారు. జార్జియాలో కీషా లాన్స్ బాటమ్స్ గవర్నర్‌గా ఎన్నికై ఆ రాష్ట్ర తొలి నల్లజాతి మహిళా గవర్నర్‌గా చరిత్ర సృష్టించారు. ఐయోవాలో డెమోక్రటిక్ అభ్యర్థి రాబ్ శాండ్ గవర్నర్ పదవిని దక్కించుకున్నారు. టెక్సాస్‌లో గినా హినోజోసా.. ప్రస్తుత గవర్నర్ గ్రెగ్ అబాట్‌ను ఓడించి, ఆ రాష్ట్ర గవర్నర్‌గా ఎన్నికైన తొలి లాటినా మహిళగా నిలిచారు. ఓహియోలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జేడీ వాన్స్ స్థానంలో సెనెట్‌కు నియమితులైన రిపబ్లికన్ జాన్ హస్టెడ్.. డెమోక్రటిక్ అభ్యర్థి షెర్రాడ్ బ్రౌన్ చేతిలో ఓడిపోయారు. జార్జియాలో డెమోక్రటిక్ సెనెటర్ జాన్ ఒసాఫ్ తిరిగి ఎన్నికయ్యారు. 2028 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన పోటీచేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్‌పై డెమోక్రాట్లకు పట్టు లభించడంతో ట్రంప్ తన ఇష్టానుసారం పాలన సాగించే అవకాశాలు తగ్గనున్నాయి. అధ్యక్షుడి విధానాలను అడ్డుకునే అధికారం కాంగ్రెస్‌కు ఉంది. ఇక తన పదవీకాలంలో ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా నిర్ణయాలు తీసుకోవచ్చు లేదా కాంగ్రెస్ ఆమోదించే బిల్లులపై వీటో ప్రయోగించవచ్చు. ఫలితాలు వెలువడుతున్న సమయంలో ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో వీటో అని రాసి ఉన్న ఎరుపురంగు టోపీ చిత్రాన్ని పోస్ట్ చేశారు. మధ్యంతర ఎన్నికల్లో మరో రికార్డు నమోదైంది. మిషిగన్ రాష్ట్రంలో సెనెట్ స్థానం కోసం జరిగిన హోరాహోరీ పోరులో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయ్యద్ విజయం సాధించారు. అమెరికా చరిత్రలోనే మొట్టమొదటి ముస్లిం సెనెటర్‌గా నిలిచి ఆయన చరిత్ర సృష్టించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మైక్ రోజర్స్‌ను ఆయన ఓడించారు. కాగా, సయ్యద్ భార్య కర్ణాటక మూలాలున్న వారు కావడం విశేషం.

ఇండియన్ అమెరికన్ల సత్తా

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భారత సంతతి వ్యక్తులు సత్తా చాటారు. డెమోక్రాటిక్ పార్టీ నుంచి పోటీ చేసి కీలక విజయాలు సాధించారు. వీరిలో అమీబెరా, రో ఖన్నా, సుహాస్ సుబ్రహ్మణ్యం, ప్రమీలా జయపాల్ ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా అరుణా మిల్లర్ మరోసారి ఎన్నికయ్యారు. దీంతో ప్రతినిధుల సభలో ఇండో అమెరికన్ల సంఖ్య మరింత పెరిగింది. కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీ పరిధిలో 17వ నియోజకవర్గం నుంచి రో ఖన్నా తిరిగి ఎన్నికయ్యారు. వర్జీనియాలోని 10వ నియోజకవర్గం నుంచి సుహాస్ సుబ్రహ్మణ్యం రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెక్‌వెత్‌పై విజయం సాధించారు. కాలిఫోర్నియాలోని మూడో కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి అమీ బెరా రిపబ్లికన్ అభ్యర్థి రాబ్ టక్కర్‌పై గెలిచి ఎనిమిదోసారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. వాషింగ్టన్ రాష్ట్రం ఏడో నియోజకవర్గం నుంచి ప్రమీలా జయపాల్ ఆరోసారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి డెమోక్రాటిక్ అభ్యర్థి షియా దాండియా రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌ను ఓడించారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమోక్రాటిక్ పార్టీకి చెందిన అరుణా మిల్లర్ మరోసారి ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన ఆమె ఏడేండ్ల వయసులోనే అమెరికాకు వలస వెళ్లారు.



'మురుసు' ప్రభావం..

(మొదటిపేజీ తరువాయి)

అంకంపాలెంలో 17.5 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు నివేదిక విడుదల చేశారు. ఈ వర్షం ధాటికి రిజర్వాయర్లు, చెరువుల్లోకి భారీగా వరద చేరింది. దీంతో పలుచోట్ల చెరువుల కట్టలు తెగి రహదారులు, నివాసాల్లో వరద పోటెత్తింది. ఈ కారణంగా వివిధ మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి శివారులోని పెద్దవాగు ప్రాజెక్టులో తాత్కాలికంగా నిర్మించిన రింగ్‌బండ్‌కు భారీగా వరద చేరడంతో గండ్లు పడి తెగిపోయింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి వరదను గోదావరిలోకి విడుదల చేశారు. అయినా ఎగువ ప్రాంతాల నుంచి వరద ముంచెత్తడంతో రింగ్‌బండ్ పూర్తిగా నిండి కట్టపై నుంచి వరద ప్రవహించింది. మండలంలో భారీ వర్షంతో పలు చెరువులకు గండ్లు పడి పొలాలు, గ్రామాల్లోకి వరద చేరింది.



కాంగ్రెస్ సంచులు మోస్తే.. బీజేపీ చెప్పులు మోస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

ఆ రెండు పార్టీల తెలంగాణ నాయకులు భయంతో వణుకుతున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రియాంక గాంధీ బౌన్సర్లు నెట్టివేసే పరిస్థితి రావడం కాంగ్రెస్‌లో ఆయనకు ఇస్తున్న గౌరవం ఏంటో తెలియజేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్తున్నారని, పాలన కంటే ఢిల్లీ పర్యటనలు, స్వంత రాజకీయ ప్రయోజనాలపైనే ఎక్కువ దృష్టి పెడుతున్న ఒక ఈఎంఐ ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్‌రెడ్డికి పాలనపై దృష్టి లేదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అమిత్ షా ముందు బౌన్సర్‌లా తయారయ్యారని, బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు తనకంటే వయసులో చిన్నవాడైన అమిత్ షా కాళ్లకు నమస్కరించాల్సిన పరిస్థితి రావడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దిగజార్చడమేనన్నారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కోర్టు తీర్పు వచ్చిన 24 గంటల్లోనే అమ్మేస్తామని ప్రకటించడం వెనుక కమీషన్ల ఆంతర్యం ఉందని, ఆ భూములను తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు, హైదరాబాద్ పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. భూ దందాలు, కమీషన్ల కోసమే ఎమ్మెల్యే గాంధీ రేవంత్‌రెడ్డి పంచన చేరారని ఆయన ఆరోపించారు.

చికిత్స పొందుతూ
మహిళా కండక్టర్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణికురాలు బానోత్ మౌనిక, కండక్టర్ మధ్య టికెట్ విషయంలో గొడవ జరిగింది. మౌనిక తన కుమారుడి టికెట్ చార్జీ నిమిత్తం రూ.100ఇవ్వగా చిల్లర కోసం కండక్టర్ ప్రవళికతో గొడవపడి ఘర్షణకు దిగి దుర్భాషలాడింది. ఈ క్రమంలోనే మిట్టగూడెం సెంటర్ వద్దకు చేరుకున్న సమయంలో ఆ ప్రయాణికురాలు.. ప్రవళికను బస్సులో నుంచి కిందకు తోసేసింది. దాంతో ప్రవళిక కిందపడగా.. బస్సు వెనుక చక్రాలు ఆమె కాళ్లపై నుంచి వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే ఆమెను భద్రాచలం ఆస్పత్రికి ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పది రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ప్రవళిక చివరకు మంగళవారం రాత్రి మృతి చెందింది.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి పొన్నం

మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికురాలు బస్సు నుంచి కిందకు నెట్టేయడంతో ప్రవళిక తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఉస్మానియా మార్చురీలో ఆమె మృతదేహం వద్ద మంత్రి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రవళిక తల్లికి ఉద్యోగంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. మణుగూరు డిపోలో ఆర్టీసీనే స్వచ్ఛందంగా బంద్ పాటిస్తోందన్నారు. అక్కడ మినహా మిగతా చోట్ల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా.. పోస్ట్‌మార్టం అనంతరం ప్రవళిక కళ్లను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు.





నియోజకవర్గ అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనివ్వాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాను కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, నేడు న్యూస్: హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక అలాను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి పనులు, దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించాలని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ కోరారు.ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, కంటోన్మెంట్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.



45 రోజుల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం

వలిగొండ, నేడు న్యూస్ : వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో కమిషనర్ పంచాయతీరాజ్ శాఖ, హైదరాబాద్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 45 రోజుల కార్యాచరణలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. వలిగొండ మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ సమావేశానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, తహసీల్దార్ దశరథ నాయక్, మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత, పీఏసీఎస్ ఆరూరు చైర్మన్ సి. వెంకట రామ్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎస్. భాస్కర్, ఏపీఓ పరశురాములు, పశువైద్యాధికారి అనిల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి, ఏఈఈ (పంచాయతీరాజ్) సందీప్ రెడ్డి, ఏఈఈ (ఆర్‌డబ్ల్యూఎస్) కీర్తి, మిషన్ భగీరథ ఏఈ సుమిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. పారిజాత, ఏఈ ఎలక్ట్రిసిటీ జె నరసింహ తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచుల హాజరయ్యారు.ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమ తమ శాఖల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామ పంచాయతీలకు సంబంధించిన అంశాలపై సర్పంచులకు వివరించారు.ప్రత్యేకంగా ఎల్‌నినో ప్రభావాల వల్ల కలిగే పరిణామాలు, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపుదల తదితర అంశాలపై చర్చించారు. గ్రామాల్లో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సర్పంచులు తమ తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అవసరాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, ప్రాధాన్యతా అంశాలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని ఈ సమావేశంలో సూచించారు.

వరదల వేళ అప్రమత్తతే ప్రాణరక్షణకు మార్గం

- **లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్త.. వరద నీటిని దాటే సాహసం చేయొద్దు**
- **ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం.. సూచనలు తప్పనిసరిగా పాటించాలి: సింగరేణి ఎస్ఐ బైరు గోపి**



కారేపల్లి, నేడు న్యూస్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాపాయం ఎదురయ్యే ప్రమాదం ఉందని సింగరేణి ఎస్ఐ బైరు గోపి హెచ్చరించారు. ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోందని, వర్షాలు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, పలు ప్రాంతాల్లో రహదారులపై వరద నీరు ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వాగులు, వంకలపై నుంచి వరద నీరు ప్రవహిస్తున్నప్పుడు ఎంతటి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు. నీటి ప్రవాహం తక్కువగా కనిపించినా దాని వేగాన్ని అంచనా వేయడం సాధ్యం కాదని, చిన్నపాటి నిర్లక్ష్యం సైతం ప్రాణాల మీదకు తెస్తుందని హెచ్చరించారు. పశువుల కాపరులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి: వర్షాల సమయంలో పశువులను వాగులు, వంకలు, నదుల సమీపంలోకి తీసుకెళ్లవద్దని, వరద ప్రవాహాల గుండా పశువులను దాటించే సాహసం చేయకూడదని సూచించారు. భారీ వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని తాకవద్దని హెచ్చరించారు. చెరువులు, కుంటలు, వాగులు, నీరు నిలిచిన ప్రాంతాల వద్దకు పిల్లలను వెళ్లనీయకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను నియంత్రిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు. పోలీసుల హెచ్చరికలను తేలికగా తీసుకోకుండా, భద్రతా చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్తి నష్టం కంటే ప్రాణ రక్షణే ముఖ్యమని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తత, బాధ్యతాయుతమైన వ్యవహారశైలే ప్రమాదాల నుంచి కాపాడుతాయని ఎస్ఐ బైరు గోపి పేర్కొన్నారు.

అన్ని రకాల పత్రాలున్నా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అడ్డంకులెందుకు...?

- **కీసర సబ్‌రిజిస్ట్రార్ తీరుపై ముప్పా రామారావు ఫిర్యాదు**
- **అక్రమ వసూళ్ల ఆరోపణలపై సమగ్ర విచారణకు డిమాండ్**
- **దమ్మాయిగూడ కాలనీల కొనుగోలుదారుల ఇక్కట్లు**
- **కలెక్టర్‌కు వినతిపత్రం దాఖలు**



మేడ్చల్, నేడు బ్యూరో: చట్టబద్ధమైన పత్రాలున్నా, ప్రభుత్వ అనుమతులు ఉన్నా, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఎందుకు నిలిచిపోతున్నాయనీ, దీని మూలంగా కొనుగోలుదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనీ దమ్మాయిగూడ ప్రాంతంలోని ప్లాట్ల యజమానులు, కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పా రామారావు స్పందిస్తూ, బాధితులకు న్యాయం చేయాలని, పద్మశాలి సంఘం ప్రతినిధులతో కలిసి బుధవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు ఎదురవుతున్న ఇబ్బందులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అనంతరం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భవన రుషి నాగ పద్మశాలి టౌన్‌షిప్, సాయిబృందావన్ కాలనీ, అయ్యప్ప కాలనీ, సిద్ధార్థ నగర్, మారుతి నగర్ తదితర కాలనీల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. ఆయా కాలనీల్లోని సర్వే నంబర్లు: 388, 407, 408, 409 లలో ఉన్న ప్లాట్లకు విక్రేతల వద్ద చట్టబద్ధమైన పత్రాలు, జీహెచ్ఎంసీ అనుమతులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయడం లేదని ఆరోపించారు. దీంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అక్రమ వసూళ్ల ఆరోపణలు.. విచారణకు డిమాండ్:

కొన్ని డాక్యుమెంట్లను స్టాంప్ వెండర్ల ద్వారా రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తూ, మరికొన్ని సందర్భాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొంటూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ముప్పా రామారావు కోరారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

అర్హులైన కొనుగోలుదారులకు న్యాయం చేయాలి:

చట్టబద్ధమైన పత్రాలు, సంబంధిత అనుమతులు కలిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, రిజిస్ట్రేషన్ల నిలిపివేతకు గల కారణాలను పరిశీలించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి కొనుగోలుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ముప్పా రామారావు కోరారు.

ఈ కార్యక్రమంలో పాండాల యాదగిరి గౌడ్, పద్మశాలి టౌన్‌షిప్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సదానంద్ గౌడ్, పద్మశాలి అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కోలా నరసింహ గౌడ్, పద్మశాలి టౌన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యుడు ఎం. సుబాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యల పరిష్కారంలో విశేష కృషి

- **పదోన్నతిపై మోత్కూర్‌కు బదిలీ అయిన ఏఈ సత్యనారాయణ రెడ్డికి ఘన సన్మానం**
- **సత్యనారాయణ రెడ్డి సేవలను కొనియాడిన మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి**



మేడిపల్లి, నేడు న్యూస్: విద్యుత్ సమస్యల పరిష్కారములో ఏఈ సత్యనారాయణ రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి అన్నారు. మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో పీర్జాదిగూడ సెక్షన్ పరిధిలో ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా విధులు నిర్వహించిన సత్యనారాయణ రెడ్డి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ (ఏడీఈ)గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఏడీఈ గా పదోన్నతి పై మోత్కూర్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. డివిజనల్ కార్యాలయంలో బుధవారం మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు గౌడ్ ఆధ్వర్యంలో సత్యనారాయణ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి, బండి శ్రీ రాములు గౌడ్ మాట్లాడుతూ.. సత్యనారాయణ రెడ్డి మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల పరిధిలో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలు అభినందనీయమని పేర్కొంటూ పదోన్నతితో నూతన బాధ్యతలు చేపడుతున్న ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. మోత్కూర్‌లో కూడా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి, జంగాచారి, రంజిత్ రెడ్డి, యాసారం నాగేష్, సుదర్శన్ రెడ్డి, మహ్మద్ మజర్, చింతల నర్సింహా రెడ్డి, రాజారాజు, మోహన్ కుమార్, ఇర్ఫాన్, నాగరాజు, మణిరాం నాయక్, జయందర్, ఐలయ్య యాదవ్, సోమయ్య, కపిల్, శేఖర్, ఖాజా, హైదర్, శ్రీకాంత్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ బస్‌స్టాప్ పరిరక్షణకు ఐక్య పోరాటం

బస్‌షెల్టర్‌ను యథావిధిగా కొనసాగించాలి.. నవంబర్ 15న భారీ ధర్నాకు పిలుపు



కాప్రా, నేడు న్యూస్: కుషాయిగూడ బస్‌స్టాప్ పరిరక్షణ కోసం స్థానిక కాలనీల ప్రజలు, వ్యాపారులు ఐక్యంగా ముందుకు వచ్చారు. బస్‌షెల్టర్‌తో పాటు అందులోని కుర్చీలను మార్కెట్ వైపు వెనక్కి జరిపేందుకు జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారు. అధికారులతో చర్చించి బస్‌షెల్టర్‌ను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న పూల దుకాణాలను కూడా వెనక్కి జరిపించారు. కుషాయిగూడలో రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బారికేడ్లను తొలగించాలని ట్రాఫిక్ సీఐని కోరగా, ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకులు తెలిపారు.

బారికేడ్లు తొలగించకపోతే నవంబర్ 15న ధర్నా

నవంబర్ 10లోగా ట్రాఫిక్ బారికేడ్లను తొలగించకపోతే రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటం చేపడతామని స్థానికులు ప్రకటించారు. నవంబర్ 15న కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద భారీ ధర్నా నిర్వహించడంతో పాటు, నిరసనకు మద్దతుగా వ్యాపార దుకాణాల బంద్‌కు పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. కుషాయిగూడ బస్‌స్టాప్‌పై ఆధారపడి 25 నుంచి 30 కాలనీల ప్రజలు రవాణా సౌకర్యాలు పొందుతున్నారని, బస్‌స్టాప్‌ను యథావిధిగా కొనసాగించడంతో పాటు ట్రాఫిక్ బారికేడ్లను తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ కాలనీల ఐక్యవేదిక నాయకులు పనగట్ల చక్రపాణి, చల్ల ప్రభాకర్, గణేష్ ముదిరాజ్, పంజాల బాబు గౌడ్, కొడకండ్ల యాదయ్య, బింగి భిక్షపతి గౌడ్, సల్ల వెంకటేష్, జైకృష్ణ, హరిలాల్ నాయక్, పిట్ల రాజు ముదిరాజ్, నలచెరువుల జనార్దన్, దయానంద్, సుధాకర్, రమేష్ చౌదరి, పులి నరేందర్, గోపి, సంపత్, ధీరావత్ బాలాజీ నాయక్, మనోహర్, కాసుల నందం గౌడ్, అనిల్ యాదవ్, రాంగిరివార్ నర్సింగ్ రావు, బన్నాపురం నాగరాజు, జి. కృష్ణకుమార్, ఉల్లిగడ్డ వెంకటేష్, అనిల్, వినయ్, నీల రాజేష్, రాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.





సింగరేణి మండల ప్రజలకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దంపతుల ఆత్మీయ ఆహ్వానం!

కారేపల్లి, నేడు న్యూస్: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఆయన సతీమణి మాలోత్ లలిత దంపతులు సింగరేణి మండల ప్రజలకు ఆత్మీయ ఆహ్వానం పలికారు. తమ కుటుంబంలో జరగనున్న శుభకార్యమైన డాక్టర్ గాయత్రి, రామ్ నాయక్‌ల నిశ్చితార్థ వేడుకకు మండల ప్రజలందరూ కుటుంబ సమేతంగా హాజరై నూతన జంటను ఆశీర్వదించాలని కోరారు. ఈ నెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 9.45 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీ కన్వెన్షన్, జూబ్లీ హాల్స్‌లో నిశ్చితార్థ వేడుకను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శుభ సందర్భానికి సింగరేణి మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.



ఇందిరమ్మ ఇళ్ల మాప్‌అప్ ఈ-లాటరీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

లాటరీలో ఇళ్లు పొందిన కంటోన్మెంట్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు

సికింద్రాబాద్, నేడు న్యూస్: హైదరాబాద్‌లోని క్యూఆర్ఈ– హైదరాబాద్ పరిధిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మాప్‌అప్ ఈ-లాటరీ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ-లాటరీ ప్రక్రియ ద్వారా ఇళ్లను పొందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



బోయిన్‌పల్లిలో ఘనంగా సదర్ సమ్మేళనం

యాదవ సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, నేడు న్యూస్: బోయిన్ పల్లి లో కాంగ్రెస్ నాయకుడు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా యాదవ సోదరులతో కలిసి సదర్ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనం ఎంతో ప్రత్యేకమైనదని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.పశుసంపద సంరక్షణలో, పాడి పరిశ్రమ అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎంతో కీలకమని, పాలు, పాల ఉత్పత్తుల ద్వారా సమాజానికి యాదవులు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా యాదవ సోదరులందరికీ సదర్ సమ్మేళన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో పాల్గొన్న వారితో కలిసి ఎమ్మెల్యే ఉత్సాహంగా సందడి చేశారు.



సాదుల ఆత్మరాములును అభినందించిన సీపీ రష్మీ పెరుమాళ్

సిద్దిపేట, నేడు ప్రతినిధి: సంవత్సరంలో మొత్తం 16 వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యేలా ప్రతిభ కనబరిచిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములును సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీస్ ఘనంగా అభినందించి సత్కరించారు. ఈ 16 కేసుల్లో 13 కేసులలో నిందితులకు 20 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడేలా ప్రాసిక్యూషన్ విజయవంతంగా వాదనలు వినిపించగా, కోర్టు విచారణ సమయంలో పక్కా ఆధారాలు సమర్పించి, సమర్థవంతమైన వాదనలు వినిపించి తీవ్ర నేరాలకు పాల్పడిన నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో సాదుల ఆత్మారాములు చూపిన చొరవ, నిబద్ధతను సీపీ ప్రత్యేకంగా కొనియాడారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చడంలో ప్రాసిక్యూటర్ పాత్ర అత్యంత కీలకమైనదని, ఆత్మారాములు సేవలు పోలీస్ సిబ్బందికి మరియు ప్రాసిక్యూషన్ విభాగానికి ఆదర్శనీయమని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా సాదుల ఆత్మారాములు శాలువా కప్పి, మెమంటో అందించి సీపీ రష్మీ పెరుమాళ్ ఘనంగా సత్కరించారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు జాబితా అందజేత

1,200 మంది పట్టభద్రుల వివరాలను గజ్జెల నాగేష్‌కు అందించిన మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

సికింద్రాబాద్, నేడు న్యూస్: ఓల్డ్ బోయిన్‌పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించి 1,200 మంది పట్టభద్రుల ఓటరు నమోదు జాబితాను కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ ఇన్‌చార్జ్ గజ్జెల నాగేష్‌కు ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అందజేశారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు చేపట్టిన నమోదు ప్రక్రియ వివరాలను ఆయనకు వివరించారు.పట్టభద్రుల హక్కులను పరిరక్షించడంతో పాటు వారి సమస్యలను చట్టసభలో ప్రస్తావించేందుకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఎంతో కీలకమని నాయకులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా మరింత విస్తృతంగా అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, కార్యదర్శి హరినాథ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు యాదవ్, బుర్రి యాదగిరి, మహేందర్ యాదవ్, మోహన్, మోహన్ ముదిరాజ్, నాని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సంకటమద్ది చిన్నారుల వేడుక

చిన్నారులు తన్వి రెడ్డి, వేదాంశ్ రెడ్డిలను ఆశీర్వదించిన సింగిరెడ్డి పద్మారెడ్డి

బోడుప్పల్, నేడు న్యూస్: సంకటమద్ది చిన్నారుల వేడుక ఘనంగా జరిగింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కేశవ్ నగర్ కాలనీలోని అక్షయ కన్వెన్షన్ హాల్లో సంకటమద్ది విక్రమ్ రెడ్డి – కల్పనారెడ్డి దంపతుల కుమార్తె తన్వి రెడ్డి, కుమారుడు వేదాంశ్ రెడ్డి సారీ దోతి ఫంక్షన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

ఆరోగ్య పరిరక్షణకు వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయం: వారాల వినోద్ కుమార్

కుత్బుల్లాపూర్, నేడు న్యూస్: సాయిబాబా నగర్ పరిధిలోని తెలుగు తల్లి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలుగు తల్లి నగర్ అధ్యక్షుడు తారా సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, తెలుగు తల్లి నగర్ అధ్యక్షుడు తారా సింగ్, కరాటే శీను, నారాయణ, బద్రి, లక్ష్మణ్, జహీర్, కాసా రాధాకృష్ణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బస్తీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్ల యజమానులు
నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- **అసాంఘిక కార్యకలాపాలకు వసతి గృహాలు అడ్డాగా మారకూడదు**
- **యజమానులు, మేనేజర్లకు డీసీపీ డాక్టర్ శ్రీధర్, ఏసీపీ యాదగిరి రెడ్డి సూచనలు**

సికింద్రాబాద్, నేడు న్యూస్: హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు, డార్మిటరీల యజమానులు మరియు మేనేజర్లు పోలీసు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మల్కాజిగిరి డీసీపీ డాక్టర్ శ్రీధర్, ఐపీఎస్ సూచించారు. వసతి గృహాల్లో ఎలాంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అవకాశం కల్పించకూడదని స్పష్టం చేశారు.ఈ మేరకు బుధవారం సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో గోపాలపురం, మార్కెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు, డార్మిటరీల యజమానులు, మేనేజర్లతో పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య





అతిథులుగా మల్కాజిగిరి డీసీపీ డాక్టర్ శ్రీధర్, ఐపీఎస్, మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి హాజరై పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధికారులు చేసిన ముఖ్య సూచనలు:

- హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు, డార్మిటరీల నిర్వహణకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు తప్పనిసరిగా పొందాలి.
- అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. అవసరమైన భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.
- సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలి.
- సంఘటిత నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తమ ప్రాంగణాలను వేదికగా మారనివ్వకూడదు.
- గంజాయి, ఇతర నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం జరగకుండా అప్రమత్తంగా ఉండాలి.
- అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు లేదా అనుమానాస్పద వ్యక్తులు బస చేసినట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.
- వసతి పొందే వ్యక్తుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి, పోలీసుల విచారణకు అవసరమైన సహకారం అందించాలి.

శాంతిభద్రతల పరిరక్షణలో హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్ల యజమానులు, మేనేజర్లు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి వసతి గృహం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ మధు కుమార్, మార్కెట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రామకృష్ణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఎస్ఐలు మాధవరావు, రవి నాయక్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సుమారు 100 హోటళ్లు, లాడ్జీలు, ఇతర వసతి గృహాలకు చెందిన యజమానులు, మేనేజర్లు, సిబ్బంది హాజరయ్యారు.

జర్నలిస్టుల స్థలాల కోసం
ప్రత్యేక కార్యాచరణ

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
- **అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందిస్తాం**
- **మంత్రికి వినతి పత్రం అందజేసిన జిల్లా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు..**



మేడ్చల్, నేడు బ్యూరో : తెలంగాణలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక పాలసీని మరియు శాశ్వత పరిష్కారాన్ని రూపొందిస్తోందని రెవెన్యూ,గృహ నిర్మాణ ,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి.శ్రీధర్ బాబు లకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు.త్వరలోనే అరులైన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ భవన్ కోసం స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవిచంద్ర,ప్రధాన కార్యదర్శి పాక రవీందర్ ,ఉపాధ్యక్షులు పన్నాల బాల్ రెడ్డి, రామకృష్ణ, రవికిరణ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు రామారావు, శ్రీరాములు సీనియర్ జర్నలిస్టులు, ఏం.హనుమంత్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



తుఫాను దెబ్బకు విలవిలలాడుతున్న రైతన్న

- **నీట మునిగిన పత్తి, వరి పంటలు..**
- **పెట్టుబడులు నీటిపాలు అయ్యే ప్రమాదం పంట నష్టాలను అంచనా వేసి పరిహారం అందించాలని రైతుల విజ్ఞప్తి**



కారేపల్లి, నేడు న్యూస్: తుఫాను ప్రభావంతో కారేపల్లి మండల వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతన్నను కుదేలు చేస్తున్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటలపై ప్రకృతి పగబట్టినట్లుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పత్తి, వరి పంటలు వర్షపు నీటిలో చిక్కుకోవడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మండలంలోని పలు గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వ్యవసాయ పొలాల్లో నీరు నిలిచిపోయింది. పత్తి పంటలో కాయలు తడిసిపోవడంతో నాణ్యత తగ్గి దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వరి పొలాల్లో నీరు అధికంగా నిలవడంతో పంట దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల రూపంలో వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టిన రైతులకు ఈ అకాల వర్షాలు మరింత భారంగా మారాయి. పంట చేతికందే సమయంలో వర్షాలు ముంచెత్తడంతో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వస్తాయో లేదోనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల ప్రభావం వ్యవసాయ రంగానికే కాకుండా జనజీవనంపై కూడా పడింది. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ అంతర్గత రహదారులు బురదమయంగా మారి రాకపోకలకు ఆటంకంగా మారాయి. అత్యవసరంగా రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి మండలంలోని వర్ష ప్రభావిత గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని రైతులు కోరుతున్నారు. పత్తి, వరి పంటలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి పారదర్శకంగా అంచనా వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని కారేపల్లి మండల రైతాంగం కోరుతోంది.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో
సాధారణ ప్రసవాలు పెంచాలి

- **గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
- **వైద్య సిబ్బందికి కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం**

యాదాద్రిభువనగిరి : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం భువనగిరి మండలం బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ఆసుపత్రికి రోజూ వస్తున్న రోగుల సంఖ్య, ఓపీ వివరాల ఆన్‌లైన్ నమోదు,అభా రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.గత నెలలో ప్రసవ తేదీలు ఉన్న గర్భిణులు ఎంతమంది? వారిలో ఎంతమందికి సాధారణ ప్రసవాలు నిర్వహించారంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ ప్రసవాలు నిర్వహించ కపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణుల కు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, నిరంతర పర్యవేక్షణతో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకో వాలని స్పష్టం చేశారు.ఆసుపత్రికి వచ్చిన గర్భిణు లు, బాలింతలతో నేరుగా మాట్లాడి వైద్య సేవలు, హిమోగ్లోబిన్ శాతం, మందుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఐరన్‌తోపాటు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

బీబీనగర్ : మండలంలోని రామునిగుండ్ల తండ గ్రామ పంచాయతీ పరిధిలోని రామునిగుండ్ల తండలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి సర్పంచ్ బానోతు గోపీ నాయక్ బుధవారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు బానోతు సునీత--మోహన్ దంపతుల ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గోపీ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బార్మవత్ బిక్షపతి నాయక్,నగేష్ నాయక్,రాజు నాయక్, లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులకు ఆమోదం

పెండింగ్ అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌కు మాజీ కార్పొరేటర్ల వినతి

కాప్రా, నేడు న్యూస్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఐఏఎస్‌ను మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కుషాయిగూడ డీమార్ట్ నుంచి సాయినగర్ కాలనీ వరకు రూ.73 లక్షలతో చేపట్టనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను అత్యవసర పనులుగా మంజూరు చేయాలని బొంతు శ్రీదేవి యాదవ్ కోరగా, జోనల్ కమిషనర్ వెంటనే నిధులు మంజూరు చేశారు. అలాగే రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, శ్రీకృష్ణ నగర్‌లలో రూ.1.26 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. మారుతి ఎన్‌క్లేవ్ పార్కు అభివృద్ధికి గతంలో మంజూరైన రూ.2.30 కోట్ల పనులను 15 రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. పాడైన వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్లు కోరారు. దోమల నివారణకు వినియోగిస్తున్న ఫాగింగ్ యంత్రం పనితీరును అభినందిస్తూ, అన్ని కాలనీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది కొరతను పరిష్కరించి సిబ్బందిని పెంచాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబును ఇటీవల కలిసిన విషయాన్ని కమిషనర్‌కు వివరించి, ప్రతిపాదిత అభివృద్ధి పనులకు త్వరలో మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని విజ్ఞప్తి చేశారు. మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి, పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ అంశాలపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



దీపావళి వేడుకల్లో భద్రతా జాగ్రత్తలు తప్పనిసరి

క్రాకర్ షాపుల యజమానులకు కుషాయిగూడ పోలీసుల సూచనలు

కాప్రా, నేడు న్యూస్: దీపావళి పండుగ నేపథ్యంలో క్రాకర్ షాపుల యజమానులు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని కుషాయిగూడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి సూచించారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో క్రాకర్ షాపుల ముందు నీళ్లు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన అన్ని అనుమతులు పొందిన తర్వాతే దుకాణాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ అనంతరం మిగిలిన బాణసంచాను నివాస ప్రాంతాల్లో నిల్వ చేయడం లేదా డంపింగ్ చేయడం నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు బాణసంచాను స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సాయిలు, సతీష్, విజయ్, పోలీస్ సిబ్బంది, క్రాకర్ షాపుల యజమానులు నిరుకొండ సతీష్ బాబు, తాడూరి గగన్ కుమార్, రామచంద్రం, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



చర్చి గాగిల్లాపూర్ ప్రభుత్వ భూమిలో అక్రమ షెడ్డు

కుత్బుల్లాపూర్, నేడు న్యూస్: దుండిగల్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలు కేవలం తాత్కాలికమేనా? ఆక్రమణదారులకు అడ్డుకట్ట వేసే బాధ్యత కలిగిన రెవెన్యూ యంత్రాంగం ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోంది? అన్న ప్రశ్నలు చర్చి గాగిల్లాపూర్ పరిధిలోని సర్వే నంబర్ 214లో చోటుచేసుకుంటున్న పరిణామాలతో తలెత్తుతున్నాయి. గతంలో ఇదే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిగా గుర్తించిన స్థలంలో నిర్మించిన షెడ్డును రెవెన్యూ అధికారులు కూల్చివేసారు. అయితే కొంతకాలం గడవకముందే అదే స్థలంలో మళ్లీ భారీ కమర్షియల్ షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఒకసారి ప్రభుత్వ భూమిగా గుర్తించి కూల్చివేసిన నిర్మాణం తిరిగి ఎలా వెలిసింది? మళ్లీ నిర్మాణం జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు? గతంలో తీసుకున్న చర్యలు ఎందుకు కొనసాగడం లేదు? అధికారులకు ముడుపులు ముట్టయా అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే
- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేయాలన్నది లక్ష్యం
- క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మేడ్చల్, నేడు బ్యూరో: రాష్ట్రంలో ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీ – సర్వే చేపడుతున్నామని, రైతుల భూ సమస్యల పరిష్కారం వారి సమక్షంలోనే రీ–సర్వే జరగాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రీ–సర్వే జరిగే గ్రామాల్లో ప్రతిరోజు తహశీల్దార్లు పర్యటించాలని, ఆర్డీవో, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడమేగాక కనీసం వారానికోరోజు రీ–సర్వే జరిగే గ్రామాలకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వే చేసి, భూ యజమానులకు పూర్తి భద్రతతో కూడిన వివాదరహిత భూములను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వారి భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు, పాస్ బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి. శ్రీధర్ బాబు తో కలిసి మేడ్చల్ – మల్కాజ్‌గిరి కలెక్టరేట్లో భూ సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా వేగవంతంగా చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ఈసారి నేరుగా జిల్లాలకు వచ్చి స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో సమావేశమై సమస్యలను సమీక్షిస్తున్నట్లు మంత్రి చెప్పారు. మండల స్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుతున్న అంశాలు, అధికారులకు ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ స్థాయి అనుమతులు, మార్గదర్శకాలపై ఉన్నది ఉన్నట్లుగా అధికారులు వివరించాలని సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా స్పష్టంగా తెలియజేస్తే అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టించే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై అదే స్థాయిలో తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా, సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలు వంటి అంశాలను కూడా సమగ్ర సర్వే ద్వారా గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు సమష్టిగా కష్టపడి పనిచేయాలని కోరారు. 22ఎ కు సంబంధించి ఇప్పటి వరకు ఇచ్చిన జీవో లు, మెమో లతో కవర్ కానీ అంశాలు ఏమైనా ఉంటే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్ రెడ్డి, అరికేపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర రెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



దీపావళికి ఇందిరమ్మ ఇళ్లలో వేడుకలు



- లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలి
- రాష్ట్రంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి
- వివిధ నిర్మాణ దశల్లో 1.90 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- 4 కార్పొరేషన్ల లోనూ హైదరాబాద్ తరహా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మేడ్చల్, నేడు బ్యూరో: నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద ఇప్పటి వరకు 2,21,500 ఇళ్లు నిర్మించి ఇచ్చామని, వారు గృహప్రవేశాలు కూడా పూర్తయ్యాయని ఈ ఇళ్లలో ఈ దీపావళి రోజున ప్రతి ఇందిరమ్మ ఇంటిలో దీపావళి వేడుకలను నిర్వహించనున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ రోజు ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కి దీపం వెలుగులన్నారు. బుధవారం మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ లో మీడియాతో రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక అవరోధాలున్నా, పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు. భద్రత, భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్న సంకల్పంతో తొలివిడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, ఇప్పటికి 2,21,500 ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తి చేశామన్నారు. మరో 1.90 లక్షల ఇళ్ళు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. గృహ ప్రవేశాలు జరుపుకున్న ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు, మమేకమైన అందరూ ఆ ఇళ్లకు వెళ్లి వారి ఆనందాల్లో భాగస్వాములు కావాలని కోరారు. దీనికి సూచికగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు అనే పోస్టర్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా రాష్ట్ర మంత్రి వర్గం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని కోరుతోందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లు, రెండో విడత 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని మంత్రి పొంగులేటి చెబుతూ, హైదరాబాద్ తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్‌లలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామన్నారు. అక్కడ జి+5 పద్ధతిలో నిర్మించనున్న ఈ టవర్స్ నిర్మాణానికి సంబం ధించి దీపావళి లోగా నోటిఫికేషన్ జారీ చేయనున్నామన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ ఇళ్లను వచ్చే ఏడాది బోనాల పండుగకు బోనాలు ఎత్తిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో రూ.40 వేల కోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితు ల్లోనూ ఆపేదిలేదని స్పష్టం చేస్తూ, ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ప్రతి సోమవారం నేరుగా హైదరాబాద్ నుంచి అవినీతి రహితంగా నిధులను జమచేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, గ్రామాలేగాక మారుమూల ప్రాంతాలు, తండాలలో కూడా ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఫలితంగా పేదవారి సొంతింటి కల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ఈర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ సామ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిపై రియల్ ఎస్టేట్ దందా?

- సర్వే నంబర్ 214లో 400 గజాల స్థలం విభజించి .. 80 గజాల ప్లాట్లుగా విక్రయం
- ప్రభుత్వ భూమిని ఆక్రమించి లక్షల్లో వసూళ్లు? రెవెన్యూ అధికారుల పాత్రపై అనుమానాలు!

కుత్బుల్లాపూర్, నేడు న్యూస్: దుండిగల్ మున్సిపల్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్ ప్రభుత్వ భూముల పరిరక్షణ గాలికి వదిలేశారా? ఆక్రమణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందా? అన్న అనుమానాలు సర్వే నంబర్ 214 పరిధిలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో వ్యక్తమవుతున్నాయి. సుమారు 400 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఓకబ్జాదారుడు చిన్న చిన్న భాగాలుగా విభజించి, ఒక్కోటి 80 గజాల ప్లాట్లుగా చేసి అమాయక ప్రజలకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నాడు. కబ్జాదారుడికి ప్రభుత్వ భూమిని వ్యక్తిగత స్థలాలుగా విభజించి విక్రయించే అధికారం ఎవరిచ్చారు? భూమికి సంబంధించిన పట్టా పత్రాలు ఉన్నాయా? రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందా? అసలు 59జీవో ఉందా ఉంటే ఎవరి పేరు పైన ఉంది. ఆ వ్యక్తికి ఎవరు అలర్ట్ చేసారు అనే ఆధారాలు స్థానిక రెవిన్యూ అధికారులు సేకరించి విచారణ జరపాలి. కానీ కింది స్థాయి సిబ్బంది కబ్జాదారుడితో చేతులు కలిపి తలా కొంచెం తిలా పెడికెడు అన్నట్టుగా ప్రభుత్వ భూమి కాళీ చేస్తున్నారు.

కలెక్టర్ సారూ.. ప్రభుత్వ భూమిని కాపాడేదెవరు?

సర్వే నంబర్ 214లోని 400 గజాల స్థలంపై తక్షణమే సర్వే నిర్వహించి, భూమి స్వరూపం, యాజమాన్య హక్కులు, నిర్మాణ అనుమతులు, ప్లాట్ల విక్రయాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి. ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితం

భారత్‌కు లాభమా?

భారత రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం ఏమిటి?

2026 అమెరికా మధ్యంతర ఎన్నికలు ప్రపంచ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మలుపుగా మారాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో కొనసాగుతున్నప్పటికీ, కాంగ్రెస్‌లోని హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్ రెండింటిపైనా డెమోక్రటిక్ పార్టీ నియంత్రణ సాధించింది. దీంతో అమెరికాలో ఇకపై ఒకే పార్టీ ఆధిపత్యం కాకుండా విభజిత ప్రభుత్వం ఏర్పడింది. భారత్ దృష్టిలో ఇది కొన్ని సవాళ్లతో పాటు ముఖ్యమైన అవకాశాలను కూడా తీసుకురావచ్చు.



భారత రాజకీయ వ్యవస్థతో పోలిస్తే. భారత్‌లో కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో స్పష్టమైన మెజారిటీ ఉంటే చట్టాలు చేయడం సులభం. రాజ్యసభలో పరిస్థితి భిన్నంగా ఉన్నప్పటికీ, బలమైన కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ కార్యక్రమాన్ని అమలు చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అమెరికాలో మాత్రం అధ్యక్షుడు ఒక పార్టీకి, కాంగ్రెస్ మరో పార్టీకి చెందినప్పుడు వ్యవస్థలో సహజంగానే నియంత్రణలు, రాజీలు, చర్చలు పెరుగుతాయి.

భారత రాజకీయాలకు ఇందులో ఒక ముఖ్యమైన పాఠం ఉంది: ప్రజాస్వామ్యంలో ఎన్నికల విజయం శాశ్వత అధికారానికి హామీ కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తి చెందితే, తదుపరి ఎన్నికల్లో సమతుల్యతను మార్చగలరు. అమెరికా మధ్యంతర ఎన్నికలను అందుకే అధికార ప్రభుత్వంపై ఒక రకమైన మధ్యకాల ప్రజాభిప్రాయ పరీక్షగా భావిస్తారు.

భారత్‌కు మొదటి అవకాశం: ట్రంప్ విధానాలపై నియంత్రణ. ట్రంప్ ప్రభుత్వ వాణిజ్య విధానంలో సుంకాలు (ఖ్రితీఅటటం) ఒక ప్రధాన ఆయుధంగా మారాయి. భారత్‌తో వాణిజ్య చర్చల్లో కూడా అమెరికా సుంకాల అంశాన్ని ఒత్తిడికి ఉపయోగించింది. 2026లో భారత్‌పై అమెరికా తీసుకున్న కొన్ని సుంకాల చర్యలు భారత ఎగుమతిదారులు, రూపాయి, మార్కెట్ సెంటిమెంట్‌పై ఆందోళన కలిగించాయి. ఇప్పుడు కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల నియంత్రణ పెరగడంతో ట్రంప్ తీసుకునే ఏకపక్ష ఆర్థిక నిర్ణయాలపై రాజకీయ పర్యవేక్షణ పెరగవచ్చు. ఇది భారత ఎగుమతిదారులకు మరింత ఊహించదగిన వాణిజ్య వాతావరణాన్ని కల్పించే అవకాశం ఉంది.

రెండో అవకాశం: భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందం. మధ్యంతర ఎన్నికల్లో ఎదురైన ఎదురుదెబ్బ తర్వాత ట్రంప్ ఒక ముఖ్యమైన విదేశాంగ లేదా ఆర్థిక విజయాన్ని త్వరగా చూపించాలని ప్రయత్నించే అవకాశం ఉంది. అందువల్ల భారత్‌తో పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా పూర్తి చేయడానికి అమెరికా ఆసక్తి చూపవచ్చు. ఇది భారతదేశానికి ఒక చర్చల అవకాశం. అయితే తొందరపడి అమెరికా షరతులను అంగీకరించడం భారత్‌కు ప్రయోజనకరం కాదు. వ్యవసాయం, పాల ఉత్పత్తులు, డిజిటల్ రంగం, ఔషధాలు, తయారీ రంగం వంటి భారత ప్రయోజనాలను రక్షిస్తూ సమతుల్య ఒప్పందం కుదుర్చుకోవాలి.

మూడో అవకాశం: చమురు ధరలు. ఇరాన్ యుద్ధం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు అమెరికా ఎన్నికల్లో కూడా ప్రధాన అంశాలుగా మారాయి. కాంగ్రెస్‌లో ట్రంప్ విదేశాంగ విధానంపై విమర్శలు, పర్యవేక్షణ పెరిగితే ఉద్రిక్తతలను తగ్గించే రాజకీయ ఒత్తిడి పెరగవచ్చు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద చమురు దిగుమతి దేశాలలో ఒకటి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గితే భారత్‌కు భారీ ప్రయోజనం ఉంటుంది. దిగుమతి బిల్లు తగ్గడం, ద్రవ్యోల్బణంపై నియంత్రణ, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటం వంటి ప్రయోజనాలు కలుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం. అమెరికా రాజకీయ అనిశ్చితి మొదట్లో భారత స్టాక్ మార్కెట్లలో కొంత హెచ్చుతగ్గులకు కారణం కావచ్చు. విదేశీ పెట్టుబడిదారుల ప్రవాహం, డాలర్ విలువ, అమెరికా వడ్డీ రేట్లు భారత మార్కెట్లపై ప్రభావం చూపుతాయి. తాజా ఫలితాల నేపథ్యంలో భారత మార్కెట్లు కూడా అమెరికా ఎన్నికల ప్రభావాన్ని, విదేశీ పెట్టుబడి ప్రవాహాలను అంచనా వేస్తున్నాయి. కానీ దీర్ఘకాలంలో అమెరికా విధానాలు మరింత చర్చాపూర్వకంగా, స్థిరంగా మారితే భారత ఐటీ, ఫార్మా, తయారీ, ఎగుమతి రంగాలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. అయితే భారత్‌కు ప్రమాదాలు కూడా ఉన్నాయి. డెమోక్రాట్ల విజయం అంటే అమెరికా విధానం వెంటనే భారత్‌కు అనుకూలంగా మారుతుందని భావించడం పొరపాటు. డెమోక్రాట్లు కూడా అమెరికా ఉద్యోగాలు, తయారీ రంగం, చైనా పోటీ, వలసలు వంటి అంశాల్లో తమ దేశ ప్రయోజనాలనే ముందుకు పెడతారు. అంతేకాకుండా, బలహీనపడిన ట్రంప్ ప్రభుత్వం రాజకీయ విజయాల కోసం భారత్‌పై త్వరగా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఒత్తిడి పెంచే అవకాశం కూడా ఉంది.

2026 అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితం భారత్‌కు నేరుగా విజయం కాదు, కానీ ఒక వ్యూహాత్మక అవకాశం. అమెరికాలో అధికార సమతుల్యత ఏర్పడటం వల్ల ఏకపక్ష నిర్ణయాలపై నియంత్రణ పెరగవచ్చు. వాణిజ్య చర్చలకు కొత్త అవకాశాలు రావచ్చు. చమురు ధరలు, ప్రపంచ ఉద్రిక్తతలు తగ్గితే భారత ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం కలగవచ్చు. భారత్‌కు అసలు లాభం అమెరికాలో ఎవరు గెలిచారన్నదానిలో లేదు. అమెరికా రాజకీయ అస్థిరతను భారత ప్రయోజనాలకు అనుకూలమైన వాణిజ్య, విదేశాంగ, పెట్టుబడి అవకాశాలుగా మార్చుకునే భారత ప్రభుత్వ సామర్థ్యంపైనే అసలు లాభనష్టాలు ఆధారపడి ఉంటాయి. భారత్‌కు ప్రధానంగా మూడు అవకాశాలు కనిపిస్తున్నాయి, అమెరికా సుంకాల విధానంపై ఎక్కువ రాజకీయ పర్యవేక్షణ, వేగవంతమైన భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందానికి అవకాశం, చమురు ధరలు తగ్గే అవకాశం. కానీ ఇవన్నీ ఇంకా రాజకీయ పరిణామాలపై ఆధారపడిన అవకాశాలే, హామీలు కావు.



- కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ రిటైర్డ్, తెలంగాణ జైల్స్



యుద్ధం వద్దు.. అమెరికన్లూ ఇదే చెప్పారు: ఇరాన్

టెహ్రాన్: అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి ప్రతికూలంగా వస్తున్న వేళ ఇరాన్ స్పందించింది. ఈ ఫలితాలతో ఇరాన్ పట్ల అమెరికా తీరు మారుతుందని ఊహించవద్దని సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇరాన్‌పై అమెరికా మ-రోసారి భీకర దాడులు చేయవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది. ఇరానీయులు కూడా అమెరికా పట్ల తమ వైఖరిని మునుపెన్నడూ లేనంత స్పష్టంగా అర్థం చేసుకున్నారని మొజ్తాబా పేర్కొన్నారు. అయినప్పటికీ, అమెరికా దాడులకు పాల్పడితే ఇరాన్ ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలను ధ్వంసం చేయడం, హర్మూజ్ జలసంధిలో పట్టుసాధించడం వంటివి అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే చర్యలేనన్నారు. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఫలితాలను ఇరాన్ నేతలు స్వాగతించారు. యుద్ధం వద్దు అనే విషయాన్ని అమెరికన్లు చెబుతున్నట్లు అర్థమవుతోందని, ఇదే సందేశాన్ని తాము కూడా సమర్థిస్తున్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు.

హర్మూజ్‌లో భారత్‌కు ఇరాన్ ప్రత్యేక మినహాయింపు

టెహ్రాన్: భారత్ సహా తమ మిత్ర దేశాల నౌకలకు హర్మూజ్‌లో ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ విధాన కమిటీ డిప్యూటీ చైర్మన్ అమీర్ హయత్ పేర్కొన్నారు. ఇతర దేశాల వాణిజ్య నౌకలపై విధించిన ఆంక్షలు లేకుండానే..ఇకపై భారత్, చైనా, ఇరాక్, ఖతార్ నౌకలు హర్మూజ్ జలసంధిని దాటవచ్చని స్పష్టం చేశారు. భారత్ నుంచి పశ్చిమాసియా దేశాలకు ఔషధాల సరఫరాను సులభతరం చేసే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆయా దేశాల నౌకల నుంచి రవాణా రుసుమును మాత్రం వసూలు చేస్తామని పేర్కొన్నారు. 'ప్రస్తుతం హర్మూజ్‌లో రవాణా ఆంక్షల నుంచి భారత్, చైనా, ఇరాక్, ఖతార్‌లకు మినహాయింపు ఇచ్చాము. ఇకపై ఆయా దేశాల నౌకలు జలసంధిలో స్వేచ్ఛగా ప్రయాణిస్తాయి. ఇరాన్ దౌత్య, ఆర్థిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయనే కారణంతోనే ఈ మినహాయింపులు ఇచ్చాము. భారత్ నుంచి ఔషధాల దిగుమతిని సులభతరం చేయడానికి, చైనా నుంచి రాజకీయ మద్దతు పొందడానికి ఈ చర్యలు చేపట్టాం' అని అమీర్ హయత్ పేర్కొన్నారు. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గంగా ఉన్న హర్మూజ్‌లో నౌకాయానంపై ఆంక్షలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

కరువులో తెలంగాణకు కేంద్రం చేయూత ఏదీ?

సమాఖ్య స్ఫూర్తి రాజకీయాలకు అతీతం కావాలి

తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటున్న వర్షాభావ పరిస్థితులు సాధారణ వ్యవసాయ సమస్యగా తీసిపారేయలేనివి. ప్రకృతి వైపరీత్యం కారణంగా రైతాంగం సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే కాకుండా కేంద్ర ప్రభుత్వానిదీ. భారత రాజ్యాంగం కల్పించిన సమాఖ్య వ్యవస్థలో అధికారాల పంపిణీ ఎంత ముఖ్యమో, ఆపద సమయంలో పరస్పర సహకారం కూడా అంతే ముఖ్యం. తెలంగాణ రైతాంగం ఇప్పుడు కోరుకుంటున్నది రాజకీయ మద్దతు కాదు, ఆర్థిక భరోసా.



2026 అక్టోబరు 27న రాష్ట్ర ప్రభుత్వం 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. వీటిలో 111 మండలాలు తీవ్ర కరువు, 254 మండలాలు మధ్యస్థ కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు రాష్ట్రంలో 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు కాగా, 17 శాతం లోటు ఏర్పడింది. పద్దెనిమిది జిల్లాల్లో వర్షపాతం లోటు నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

వర్షాభావ ప్రభావం సాగు విస్తీర్ణంపైనా పడింది. గత ఏడాది 139.28 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి అది 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. వరి సాగు 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. అంటే సుమారు 18 శాతం తగ్గుదల. ప్రధాన, మధ్యతరహా జలాశయాల మొత్తం సామర్థ్యం 585 టీఎంసీలు కాగా, అందుబాటులో ఉన్న నీటి నిల్వ కేవలం 179.63 టీఎంసీలు మాత్రమే. ఈ పరిస్థితి రబీ సాగుతోపాటు తాగునీటి సరఫరా, పశు సంపద మనుగడపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సెప్టెంబరు 18న తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రాన్ని ప్రత్యేకంగా ఆదుకోవాలని కోరింది. జాతీయ విపత్తు స్పందన నిధి (చీణ=ళీ) నుంచి సహాయం, రాష్ట్ర విపత్తు స్పందన నిధి (ణాణ=ళీ)లో కేంద్ర వాటా విడుదల, పంట నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ, పశుగ్రాసం, తాగునీటి సదుపాయాలతోపాటు రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అభ్యర్థించింది. అదనంగా 50 రోజుల ఉపాధి, 1,500 మెగావాట్ల విద్యుత్తు, రుణ పరిమితి పెంపు వంటి అంశాలనూ ప్రస్తావించింది. అనంతరం రాష్ట్రం ప్యాకేజీ అవసరాన్ని రూ.30,000 కోట్లుగా పేర్కొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అక్టోబరు 28న కరువు నివేదికను కేంద్రానికి సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన సహాయ హామీ రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

కేంద్రం నుంచి సాయం కోరడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. అయితే ఆ సహాయాన్ని ఎంత త్వరగా అందించాలన్నది కేంద్రం చిత్తశుద్ధికి పరీక్ష. కరువు తీవ్రతను అంచనా వేయడానికి కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, పంట నష్టం, భూగర్భజలాలు, పశుసంపద, గ్రామీణ ఉపాధిపై సమగ్ర నివేదిక రూపొందించాలి. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న నిధులను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలి. అవసరమైతే ప్రత్యేక ప్యాకేజీపై కూడా సానుకూలంగా పరిశీలించాలి.

ఇక్కడ రాజకీయాలకు తావుండకూడదు. కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉన్నాయన్న కారణంతో ప్రజల అవసరాలు వెనుకబడకూడదు. ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలు కూడా ప్రకృతి వైపరీత్యాల సమయంలో కేంద్ర సహాయం పొందుతున్నాయి. తెలంగాణకు కూడా అదే ప్రమాణాలు వర్తించాలి. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోలేనట్లే, కేంద్రం కూడా తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను విస్మరించకూడదు. రాష్ట్రం అడిగిన మొత్తం పూర్తిగా మంజూరు చేయాలా వద్దా అనేది వేరే విషయం; కానీ నిష్పాక్షిక పరిశీలన, పారదర్శక నిర్ణయం, తగినంత సాయం మాత్రం తప్పనిసరి.

అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా కేవలం కేంద్రం వైపు చూపిస్తూ కాలయాపన చేయరాదు. అర్హులైన రైతులను గుర్తించి పంట నష్టపరిహారం, పెట్టుబడి రాయితీని సకాలంలో అందించాలి. తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక, పశుగ్రాస కేంద్రాలు, ఉపాధి హామీ పనులు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు తీసుకోవాలి. కేంద్రం నుంచి వచ్చే సహాయం కోసం ఎదురుచూస్తూనే అందుబాటులో ఉన్న రాష్ట్ర వనరులను వినియోగించాలి.

ఫెడరలిజం అంటే రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వడం, కేంద్రానికి నిధుల పంపిణీ బాధ్యత అప్పగించడం మాత్రమే కాదు. ఒక ప్రాంతం కష్టాల్లో ఉన్నప్పుడు మరో ప్రాంతం, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అండగా నిలవడం కూడా. తెలంగాణ రైతు పొలంలో ఎండిన పంటకు రాజకీయ రంగు ఉండదు. అతని కన్నీటికి పార్టీ జెండా ఉండదు. కరువు బాధితుల ఆకలి, అప్పులు, జీవన సంక్షోభం దేశ సమస్యగా గుర్తించినప్పుడే సమాఖ్య వ్యవస్థకు నిజమైన అర్థం ఉంటుంది.

కేంద్రం వెంటనే స్పందించాలి. రాష్ట్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రైతును ఆదుకోవడంలో రాజకీయాలకు చోటివ్వకూడదు. అదే ప్రజాస్వామ్య సమాఖ్య స్ఫూర్తి.

- కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ రిటైర్డ్, తెలంగాణ జైల్స్

రజనీకాంత్ మూవీలో శ్రీలీల..

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో, అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న చిత్రం 'ధర్మన్'. కమల్ హాసన్ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ మూవీలో శ్రీలీల నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా మేకర్స్ ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేస్తూ.. శ్రీలీల ఈ సినిమాలో నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇక, ఈ చిత్రంలో రజనీ వైద్యుడిగా కనిపించనున్నారు. రామ్ పోతినేని, సిమ్రాన్, రాశీఖన్నా, నయనతార యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.





ఆమె మూడు సార్లు నా ఆఫర్‌ను రిజెక్ట్ చేసింది: సూర్య

సూర్య ప్రధాన పాత్రలో.. జీతూ మాధవన్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'సీన్'. నజ్రియా కథానాయికగా నటిస్తున్నారు. నవంబరు 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్య మాట్లాడుతూ.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గతంలో నజ్రియా మూడు సార్లు తన ఆఫర్‌ను రిజెక్ట్ చేసినట్లు తెలిపారు. నాలుగో ప్రయత్నంలో అంగీకరించారని చెప్పారు. "నా మూడు సినిమాల్లో నటించాల్సింది నేను నజ్రియాని సంప్రదించా. వివిధ కారణాలతో ఆమె నా ఆఫర్లను తిరస్కరించింది. గత 12 ఏళ్లలో పలు తమిళ చిత్రాల్లో నటించే అవకాశాలు వచ్చినప్పటికీ ఆమె అంగీకరించలేదు" అని తెలిపారు. అవకాశాలను కోల్పోయినట్లుగా నజ్రియా భావించలేదని.. నచ్చిన కథలను ఎంచుకునే విషయంలో ఆమె చూపించే ఆత్మవిశ్వాసం అభినందనీయమని సూర్య ప్రశంసించారు. "12 ఏళ్ల తర్వాత తమిళ సినిమాల్లోకి తిరిగి రావడానికి ప్రధాన కారణం.. సూర్య సర్. గతంలో ఒకట్రెండుసార్లు వివిధ కారణాలతో ఆయనతో అవకాశాలను నేను తిరస్కరించా. ఇప్పుడు ఆయనతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉంది" అని నజ్రియా అన్నారు.

'మిస్టర్ అండ్ మిసెస్ గ్రే' నిత్యామేనన్

ఒకవైపు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ తనదైన హావభావాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంటారు కథానాయిక నిత్యామేనన్. మరోవైపు నిర్మాతగానూ సినీప్రియుల్ని మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆమె.. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ గ్రే'. అంకుర్ పఖ్ని, విశాల్ రంజన్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు. శ్రేయా శర్మ, ఆశిష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఈ మేరకు 'మీరు ఎవరి కోసమైతే మీ ప్రాణాలను అర్పించారో, వారి నుంచే మీ ప్రాణాలకు ప్రమాదమని మీరు భయపడితే? ప్రతి వివాహానికి రెండు కోణాలు ఉంటాయి. ఇందులో మీరు ఊహించని కొన్ని కొత్త కోణాలు ఉన్నాయి. ప్రేమలో కూడా 'గ్రే' కలర్ అనేది ఒకటి ఉంటుంది" అనే వ్యాఖ్యలను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఒకవైపు ఒబెరాయ్, మరోవైపు నిత్యామేనన్ అస్పష్టంగా కనిపించిన తీరు ఆకట్టుకుంది. వివాహ బంధంలో దాగి ఉన్న సంక్లిష్టతలు, రహస్యాలు, మలుపులను అన్వేషించే ఒక ఉత్కంఠభరితమైన సస్పెన్స్ డ్రామా అని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా డిసెంబరు 11న విడుదల కానుంది.





ఊహించని మలుపులతో మాయలేడీ

టాలీవుడ్‌లో డిఫరెంట్ సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు రాకేష్ వర్రె, మధుమిత సర్కార్ జంటగా నటిస్తున్న లేటెస్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ 'మాయలేడీ'. ప్రశంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో కమెడియన్ సత్య, సీనియర్ నటి ఇంద్రజ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీని నవంబర్ 13న థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమాకి సంబంధించిన ఇంట్రెస్టింగ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు ఉంటే ఎలా ఉంటుంది? అనే వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. సరదా, పిచ్చి, భావోద్వేగాలు.. అన్నీ రెట్టింపు మోతాదులో, ఊహించని మలుపులతో ప్రేక్షకులను గూస్‌బంప్స్ తెప్పించేలా ఈ చిత్రం ఉండబోతుందని మేకర్స్ స్పష్టం చేశారు. ఇక ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాకేష్ వర్రె మాట్లాడుతూ.. 'పేక మేడలు' సినిమా తర్వాత ఎలాంటి సినిమా చేయాలనే దానిపై చాలా కన్ఫ్యూజన్ ఉండేదని, అందుకే రెండేళ్ల గ్యాప్ తర్వాత కమ్‌బ్యాక్ ఇస్తున్నానని చెప్పారు. ఈ సారి కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ప్రాజెక్ట్ చేయాలనే ఆలోచన నుంచే 'మాయలేడీ' పుట్టుకొచ్చిందని వెల్లడించారు. కథలోని యూనిక్‌నెస్ మిస్ అవ్వకుండా, మంచి వైబ్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేవలం యాక్షన్ సినిమాలు మాత్రమే వస్తున్నాయని, సరైన కమర్షియల్ ఎంటర్‌టైనర్లు రావడం లేదనే ఉద్దేశంతోనే ఈ రిస్క్ చేశానన్నారు. అలాగే తన నెక్స్ట్ ప్రాజెక్టుల గురించి చెబుతూ.. తాను రెండు ఓటీటీ ఒరిజినల్స్ చేస్తున్నానని, రూల్స్ వల్ల పేర్లు చెప్పడం లేదని పేర్కొన్నారు. క్యాస్టింగ్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నానని, కొత్త వారితో రిస్క్ చేయాలనే ఈ 'మాయలేడీ' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించానని స్పష్టం చేశారు.



'స్త్రీ 2' తర్వాత ఏ సినిమా చేయకపోవడానికి కారణమిదే: శ్రద్ధా కపూర్


భాలీవిజయం తర్వాత వరుసగా సినిమాలకు సంతకాలు చేస్తుంటారు కథానాయికలు. కానీ, బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఆమె ప్రధానపాత్రలో నటించిన 'స్త్రీ 2' (2024) ప్రపంచవ్యాప్తంగా రూ.875 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఆ సినిమా తర్వాత వంసగా అవకాశాలు వచ్చినా.. భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినా కొత్త చిత్రాలకు అంగీకరించలేదని శ్రద్ధ తెలిపారు. తాజాగా సోషల్‌మీడియాలో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఆమె ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. సెషన్‌లో భాగంగా ఓ అభిమాని.. 'కెరీర్‌లో ముందుకెళ్లాలనుకునే యువతులకు మీరిచ్చే సలహా ఏంటని?' అడగ్గా.. ఆమె బదులిచ్చారు. "నా అనుభవాన్నే చెబుతాను. 'స్త్రీ 2' తర్వాత నాకు చాలా సినిమా అవకాశాలు వచ్చాయి. మంచి పారితోషికాలు కూడా ఆఫర్ చేశారు. కానీ మనసుకు నచ్చిన కథ దొరికే వరకు ఓపికగా ఎదురుచూడాలని నిర్ణయించుకున్నా. అనుకున్నట్లే చేశా. మీ మనసు చెప్పేది వినండి. కొన్నిసార్లు అది కష్టంగా అనిపించినా.. చివరికి తగిన ఫలితం ఉంటుంది" అని ఆమె చెప్పారు. ప్రస్తుతం శ్రద్ధ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఈథా' చిత్రంలో నటిస్తున్నారు. ప్రముఖ లావణి కళాకారిణి 'విఠాబాయి నారాయణ్ గావ్‌కర్' జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. డిసెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



ఐదో రోజూ లాభాల జోరు..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదోరోజూ లాభాల్లో ముగిశాయి. ముడిచమురు ధరలు దిగి రావడం, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలకు అండగా నిలిచాయి. ఐటీ షేర్లు మినహా మిగిలిన షేర్లు రాణించాయి. ముఖ్యంగా ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, మెటల్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 2 శాతం, మిడ్‌క్యాప్ 1.55 శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 76,853.11 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,917.85) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా మధ్యాహ్నం కాసేపు నష్టాల్లోకి జారుకున్నప్పటికీ.. మళ్లీ తర్వాత పుంజుకొంది. చివరికి 383.55 పాయింట్ల లాభంతో 77,301.40 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 86.95 పాయింట్ల లాభంతో 23,897.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.64గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, ట్రైటాన్, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 102 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4046 డాలర్ల స్థాయికి చేరింది.



బిజినెస్



కాన్వాలో లేఆఫ్‌లు..

22 శాతం మంది ఉద్యోగులపై వేటు

ఖర్చులు తగ్గించుకోవడం, వ్యవస్థలను కొత్త టెక్నాలజీతో సరళీకరిస్తుండటం, మూలధనాన్ని కృత్రిమ మేధ, అధికవృద్ధి రంగాలవైపు మళ్లిస్తుండటం వంటి కారణాలతో కంపెనీలు సిబ్బంది సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఈ ఖాతాలో ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ గ్రాఫిక్ డిజైనింగ్ సాఫ్ట్‌వేర్ సంస్థ కాన్వా కూడా చేరింది. తమ గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 22 శాతం మంది (1,271) ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. గత దశాబ్ద కాలంలో మొదటిసారిగా కంపెనీ వృద్ధి రేటు మందగించడంతో పాటు సంస్థ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈఓ మెలానీ పెర్కిన్స్ వెల్లడించారు. ఉద్యోగాల కోతలతో పాటు పలువురి స్థానాల్లో మార్పులు, ఇతర ప్రాంతాలకు తరలింపులు వంటి చర్యలు ఉంటాయని పెర్కిన్స్ పేర్కొన్నారు. ప్రభావిత ఉద్యోగులకు సహాయ ప్యాకేజీ ప్రకటించారు.



బంగారం, వెండి ధరలు పైకి

దీపావళికి ముందు కొనుగోలుదారులకు బంగారం, వెండి షాకిచ్చాయి. ఇటీవల తగ్గినట్లే తగ్గిన ఈ రెండు లోహాల ధరలు బుధవారం మళ్లీ పెరిగాయి. అమెరికా మధ్యంతర ఎన్నికలు ఈ పెరుగుదలలో కీలక భూమిక పోషించాయి. ఈ ఎన్నికల్లో అమెరికా కాంగ్రెస్‌పై డెమోక్రాట్లు పట్టు సాధించొచ్చన్న అంచనాల నేపథ్యంలో డాలరు విలువ క్షీణించింది. ఇది బంగారం, వెండికి డిమాండ్ పెంచింది. దీంతో అంతర్జాతీయ విపణిలో స్పాట్‌గోల్డ్ 2 శాతం మేర పెరిగి మళ్లీ ఔన్సు 4 వేల డాలర్లు దాటింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు స్పాట్‌గోల్డ్ ఔన్సు 4025 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. వెండి ఔన్సు 51 డాలర్ల వద్ద కొనసాగుతోంది. రూపాయి విలువ 94.84గా ఉంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1.45 లక్షలు (పన్నులు కలిపి) పలుకుతోంది. వెండి సైతం కిలో రూ.1.90 లక్షలుగా ఉంది. మంగళవారం నాటి ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.2500 మేర పెరగ్గా.. వెండి దాదాపు రూ.5వేలు పెరిగింది. అటు ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబర్ డెలివరీ బంగారం 10 గ్రాములు రూ.1.42 లక్షలు పలుకుతుండగా.. వెండి రూ.1.86 లక్షల వద్ద కొనసాగుతోంది. మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో ఎంసీఎక్స్‌లో బంగారం 10 గ్రాములు రూ.1.39 లక్షలు పలకగా.. వెండి కిలో రూ.1.79 లక్షల వద్ద ముగిసింది. ఆ లెక్కన ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఒక్క రోజులోనే బంగారం రూ.3 వేలు, వెండి రూ.6 వేల చొప్పున పెరిగాయి.



చిన్న నోట్ల కొరత లేదు: ఆర్‌బీఐ

దీపావళి సందర్భంగా చిన్న నోట్ల కొరత ఏర్పడుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. రూ.10, రూ.20, రూ.50 విలువ కలిగిన కరెన్సీ నోట్లకు కొరత ఏర్పడిందంటూ వస్తున్న వదంతులను నమ్మొద్దని తెలిపింది. '2026 అక్టోబరు 27వ తేదీతో ఆర్‌బీఐ జారీ చేసినట్లు ఉన్న నకిలీ సర్క్యులర్'లో డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో చిన్న నోట్ల ముద్రణ తగ్గిస్తున్నారని, దీంతో పండగ సమయంలో వీటి కొరత ఏర్పడొచ్చని ఉంది. ఇది పూర్తిగా తప్పుడు ప్రచారమని 'ఎక్స్' వేదికగా ఆర్‌బీఐ.స్పష్టం చేసింది. అన్ని విలువల కరెన్సీ నోట్లు, ముఖ్యంగా చిన్న నోట్లూ తమ ఖజానాలు, కరెన్సీ చెస్ట్‌లలో తగినంతగా ఉన్నాయని వెల్లడించింది. ఆర్‌బీఐ పేరుతో వచ్చే ప్రకటనలు, సర్క్యులర్లను నమ్మే ముందు అధికారిక వెబ్‌సైట్, ధ్రువీకరించిన సామాజిక మాధ్యమ ఖాతాల్లో పరిశీలించాలని ప్రజలకు సూచించింది.



కోహ్లీ మెరుపులు..

తొలి వన్డేలో భారత్ ఘన విజయం

ఆక్లాండ్: న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న టీమ్‌ఇండియా ఇప్పటికే టీ20 సిరీస్‌ను కైవసం చేసుకోగా.. ఇప్పుడు ఐదు వన్డేల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి వన్డేలో భారత్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. టీమ్‌ఇండియా ఛేదనకు దిగిన అనంతరం ఆటకు వరుణుడు పలుమార్లు అంతరాయం కలిగించాడు. దీంతో తొలుత భారత్ టార్గెట్‌ను 40 ఓవర్లకు 167 పరుగులకు కుదించారు. ఆట తిరిగి ప్రారంభమైన కొద్దిసేపటికే మళ్లీ వర్షం మొదలైంది. వరుణుడు శాంతించిన తర్వాత ఆట పునఃప్రారంభం కాగా.. భారత జట్టు లక్ష్యాన్ని 32 ఓవర్లకు 143 పరుగులుగా నిర్దేశించారు. టీమ్‌ఇండియా 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ని ఛేదించింది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లీ (74; 51 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో మెరిశాడు. శుభ్‌మన్ గిల్ (37; 56 బంతుల్లో) ఫర్వాలేదనిపించాడు. శ్రేయస్ అయ్యర్ (15) పరుగులు చేశాడు. ఆరు బంతులు ఎదుర్కొన్న రోహిత్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. అక్షర్ పటేల్ కూడా పరుగుల ఖాతా తెరవలేదు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ 3, జేమీసన్, నాథన్ స్మిత్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు భారత బౌలర్ల దెబ్బకు కివీస్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (38) టాప్ స్కోరర్. టీమ్‌ఇండియా బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4, గుర్నూర్ బ్రార్ 3, అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లు తీశారు. మరొక వికెట్ రనౌట్ రూపంలో వచ్చింది. రెండో వన్డే వెల్లింగ్టన్‌లో శనివారం జరగనుంది.



విరాట్ కోహ్లీ సరికొత్త చరిత్ర..

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మైదానంలోకి దిగితే రికార్డులు బద్దలు కావాల్సిందే. తాజాగా అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ 37 ఏళ్ల ప్లేయర్ ప్రస్తుతం న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలో తొలి వన్డేలో 12 పరుగులకు చేరుకోగానే.. విరాట్ చరిత్ర సృష్టించాడు. వన్డేల్లో వన్‌డౌన్‌లో వచ్చిన విరాట్ 61.55 సగటుతో 13వేల పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నమోదు చేశాడు. అందుకోసం అతడు కేవలం 251 ఇన్నింగ్స్‌లను మాత్రమే తీసుకోవడం గమనార్హం. ఇందులో 48 సెంచరీలు, 70 అర్ధ శతకాలు బాదాడు. ఇప్పటి వరకు ఎక్కువ పరుగులు చేసిన రికార్డు రికీ పాంటింగ్ పేరిట ఉండేది. అతడు 330 ఇన్నింగ్స్‌ల్లో 12,662 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా విరాట్ కోహ్లీ ఇప్పటి వరకు వన్డేల్లో 318 మ్యాచుల్లో 15వేలకుపైగా పరుగులు చేశాడు.

రోహిత్ 'సూపర్ త్రో'

మైదానంలో నెమ్మదిగా ఉంటాడనే విమర్శలకు తన ఫీల్డింగ్ నైపుణ్యంతో రోహిత్ శర్మ సమాధానం చెప్పాడు. కివీస్‌తో తొలి వన్డేలో షార్ట్ లెగ్‌సైడ్ ఫీల్డింగ్ చేస్తుండగా.. తనవైపు వచ్చిన బంతిని ఆపడమే కాకుండా డారిల్ మిచెల్ (28)ను పెవిలియన్‌కు చేర్చాడు. సూపర్ త్రో విసిరి భారత్‌కు కీలక వికెట్ అందించాడు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com